

ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారికి మత్స్య అలంకరణ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 572.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,578 క్యూసెక్కులు వదిలారు.

మహానందీశ్వరునికి అభిషేకాలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలోని మహానందీశ్వరునికి ఆదివారం పంచామృత సహిత విశేష ద్రవ్యాలతో ప్రదోష కాల అభిషేకాలు నిర్వహించారు.

సంక్షేమంలోనూ కోతలే!

- వైఎస్ జగన్ పరిపాలనలో అన్ని వర్గాలకు పథకాల వెల్లువ
- కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నీ నిలిపివేత
- అధికారంలోకి రాగానే అమ్మ ఒడికి మంగళం
- రైతు భరోసా లేక అన్నదాతలు విలవిల
- డ్వాక్రా మహిళలకు రుణాలపై వడ్డీ మాఫీ కరవు
- ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులపై భారం
- జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఇయర్ రౌండప్



జగనన్న విద్యా దీవెన చెక్కు విద్యార్థులకు అందజేస్తున్న అప్పటి కలెక్టర్ వేణుగోపాలరెడ్డి (ఫైల్)



లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక చెక్కు అందజేస్తున్న అప్పటి మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్‌నాయుడు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ కార్యక్రమాలకు నిలువునా కోత పడింది. ఎంతవరకు ప్రజలకు అది చేశాం.. ఇది చేశాం.. అంటూ పాలకులు కోతలు కోయడం మినహా వాస్తవానికి చేసింది శూన్యమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు అందించిన సంక్షేమం నేడు నిలిచిపోయింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వెల్లువలా కొనసాగిన సంక్షేమ పథకాలు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చే ముందుకు వరకు నిరాటంకంగా పరుగులు పెట్టాయి. ఆరు నెలల కూటమి పాలనలో పడకేశాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల చదువులకు ప్రోత్సాహకంగా అందించిన జగనన్న అమ్మ ఒడి, పంటలు పండించుకునే రైతన్నలకు అండగా నిలిచేలా రైతు భరోసా రూపంలో అందించిన పెట్టుబడి సాయం, డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలపై వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, కళాశాలల్లో ఉన్నత చదువులకు అండగా నిలిచిన ఫీజు రీ ఎంబర్స్‌మెంట్, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.25 లక్షల వరకు ఉచితంగా అందించిన వైద్యం... ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఐదేళ్లపాటు నిరాటంకంగా అందిన సంక్షేమ కార్యక్రమాలు ప్రస్తుత కూటమి పాలనలో కనుమరుగయ్యాయి.



రూ.65 లక్షలతో తీర్చిదిద్దిన వెనిగండ్ల శ్రీవేమన జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం

ఇంటి ముంగిటకే సంక్షేమం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సంక్షేమాన్ని ప్రతి గడపకు పంపిన ఘనత నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుంది. దళారీ వ్యవస్థకు అస్కారం లేకుండా, సిఫార్సులతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నాడు అందించారు. ముందుగానే షెడ్యూల్ వేసి ఆ ప్రకారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన సందర్భాలు నేడు కనుమరుగయ్యాయి. వైసీపీ పాలనలో గుంటూరు జిల్లాలో గత జనవరి నుంచి ఏప్రిల్‌లో ఎన్నికల కోడ్ వచ్చే ముందు వరకు గత ప్రభుత్వం వివిధ పథకాలకు భారీగా నిధులు మంజూరు చేసింది.

విద్యార్థుల తల్లులకు మొండిచేయి

కూటమి ప్రభుత్వం రావడంతోనే సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. అధికార పగ్గాలు చేపట్టిన జూన్ నెలలో మొదటగా అమ్మ ఒడికి బదులుగా తెస్తామన్న తల్లికి వందనం ప్రశ్నార్థకమైంది. జూన్ నెలలో పాఠశాలలు పునః ప్రారంభమైన తరువాత తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున నగదు జమ చేసినప్పుడు ఎంతగానో ప్రయోజనం చేకూరింది. కొవిడ్ సంక్షోభ పరిస్థితుల్లో సైతం ఆగకుండా అమ్మ ఒడి అందింది. కూటమి సర్కారు ఈ సాయం నిలిపివేసింది.

అన్నదాతలకు కన్నీరే

రైతు భరోసా కింద అందించిన పెట్టుబడి సాయంపై ఇప్పుడు ఊసే లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ కింద ఒక్క పైసా ఇవ్వకపోవడంతో ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తివిద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తుండటంతో తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోంది. డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ నిధులు జమ కాలేదు. వాహన మిత్ర కింద ఆటో డ్రైవర్లకు అందిన రూ.10 వేల సాయం నేడు కరవైంది. ఇలా అన్ని సంక్షేమ కార్యక్రమాలకు కోత పడింది.

నాడు రూ.కోట్లలో లబ్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కలిగిన ఆర్థిక లబ్ధిని పరిశీలిస్తే గతేడాదితో పాటు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఈ ఏడాదిలోని సమయంలో జగనన్న అమ్మ ఒడి కింద గుంటూరు జిల్లాలోని 1,59,594 మంది మాతృమూర్తులకు రూ.239.39 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న 38,252 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.80.35 కోట్ల ఫీజులు చెల్లించారు. వసతి దీవెన కింద హాస్టల్ ఖర్చులకు 37,894 మంది విద్యార్థులకు రూ.33.31 కోట్లు ఇచ్చారు. మరిన్ని పథకాల వివరాలు పట్టికలో చూడొచ్చు.

పథకం	లబ్ధిదారులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న అమ్మ ఒడి	1,59,594	239.39
జగనన్న విద్యా దీవెన	38,252	80.35
జగనన్న వసతి దీవెన	37,894	33.31
వైఎస్సార్ ఆసరా	72,748	202.15
జగనన్న చేదోడు	2,849	8.14
వైఎస్సార్ ఉచిత పంట బీమా	14,301	18.61
ఈబీసీ నేస్తం	6,350	16.93
నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు	11,403	135.91
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	16,439	19.52
వైఎస్సార్ కళ్యాణమస్తు	324	2.91
వైఎస్సార్ కాపు నేస్తం	5,375	24.42
వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా)	94,378	25
వైఎస్సార్ వాహనమిత్ర	4,393	15.29
వైఎస్సార్ మత్స్యకార నేస్తం	235	1.82
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	13,578	10.56
వైఎస్సార్ పెన్షన్ కానుక	74,238	711
జగనన్న విదేశీ విద్యాదీవెన	42	3.68
వైఎస్సార్ లా నేస్తం	243	3.04
మొత్తం		రూ. 1,552.03 కోట్లు

న్యూస్‌రీల్

శ్రీ వీరాంజనేయస్వామి సేవలో మాజీ చీఫ్ జస్టిస్



పొన్నూరు: పట్టణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి సేవలో ఆదివారం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ దంపతులు పాల్గొన్నారు. పట్టణానికి విచ్చేసిన వారికి తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. స్వామి వారిని దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈఓ గద్దె అమరనాథ్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తదితరులు మాజీ చీఫ్ జస్టిస్‌ను ఘనంగా సత్కరించారు. స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



నగరంపాలెం: ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షుడిగా యేల్చూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గుంటూరు జిన్నాటవర్ కూడలిలోని సంస్థ కార్యాలయంలో శనివారం కార్యవర్గ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అధ్యక్ష పదవికి యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ, ఆర్.వి.రామకృష్ణ ప్యానెల్స్ పోటీపడ్డాయి. 985 ఓట్లు నమోదయ్యాయి. లెక్కింపు ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల వరకు కొనసాగింది. యేల్చూరి వెంకటేశ్వర్లుకు 577, రంగా బాలకృష్ణకు 397, ఆర్.వి. రామకృష్ణకు ఎనిమిది ఓట్లు వచ్చాయి. మరో మూడు ఓట్లు చెల్లలేదని కార్యాలయ వర్గాలు తెలిపాయి. వెంకటేశ్వర్లు ప్యానెల్ విజయంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, ఈరంటి వరప్రసాద్, అంకరావు, టీఎల్‌వీ వీరాంజనేయులు, అన్న పూర్ణచంద్రరావు, కొత్త మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీఓ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. 30న వన్‌మాన్ కమిషన్ జిల్లా పర్యటన, జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల దృష్ట్యా రద్దు చేశామని తెలిపాయి. జిల్లాలోని ప్రజలు గమనించాలని కోరాయి.

14వ పాశురంపై చిన్న జీయర్ స్వామి ప్రసంగం



తాడేపల్లి రూరల్: మంగళగిరి ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 14వ పాశురాన్ని ఆదివారం భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వివరించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. మహోత్సవాలలో భాగంగా ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం నిర్వహించామని చెప్పారు. గుంటూరు, విజయనగరం, విజయవాడ ప్రాంతాలకు చెందిన భక్తులు గోదాదేవికి సారె సమర్పించారని తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠి, మంగళ శాసనాలతో కార్యక్రమాలు వైభవంగా జరిగాయని వివరించారు. భక్తులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు కూచిపూడి నృత్యాలు చేశారని తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 98, నిజాంపట్నం కాలువకు 69, కొమ్మమూరు కాలువకు 1217 క్యూసెక్కులు విడుదల చేశారు.

రాష్ట్ర వెటరన్ క్రీడా పోటీల విజేతగా విశాఖ



బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

ద్వితీయ, తృతీయ స్థానాల్లో గుంటూరు, బాపట్ల

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆరవ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2024 విజేతగా విశాఖపట్నం నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో గుంటూరు, బాపట్ల నిలిచాయి. రెండు రోజులుగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారంతో ముగిశాయి. విజేతలకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్, ఏపీఐడీసీ కార్పొరేషన చైర్మన్ డేగల ప్రభాకర్‌లు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పెమ్మసాని మాట్లాడుతూ.. ఆరోగ్యంపై శ్రద్ధ ఉంటే నిత్యం సంతోషంగా గడిపేయొచ్చన్నారు. వెటరన్ క్రీడాకారుల ప్రదర్శన యువతకు ఆదర్శమన్నారు. రాష్ట్రంలో నూతన క్రీడాపాలసీ వచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు జిల్లా ప్రజలకు లభిస్తాయన్నారు. షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ.. సుమారు 400 మంది పాల్గొన్నారని, పోటీలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్యదర్శి శ్రీలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నజీర్, మాదిలేటి రెడ్డి, బేగం, ఆదం షఫీ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



100 మీటర్ల పరుగు పందెంలో తలపడుతున్న 55 నుంచి 80 సంవత్సరాల పురుషులు

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు



పరీక్షల వివరాల నమోదుకు సిద్ధంగా కంప్యూటర్లు



శారీరక కొలతల కోసం ఏర్పాటైన పరికరాలు

నగరంపాలెం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ నెల 30 నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఈ పరీక్షల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కొలతలు తీసే కంప్యూటర్ యంత్రాల పనితీరును పరిశీలించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులు రావాలని సూచించారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), డీపీఓ ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన బెల్లం @ శృంగారపురం

ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఎక్కువమంది చక్కెరకు దూరం అవుతున్నారు. తీపి కోసం బెల్లాన్నే చూస్తున్నారు. ఎక్కడ చూసినా కల్తీమయంగా మారిన ఈ రోజుల్లో రంగు కలపని, రసాయనాల ఊసే లేని స్వచ్ఛమైన బెల్లం కోసం అన్వేషిస్తున్నారు. వ్యయ ప్రయాసలు చూడ్డంలేదు. అలాంటివారితో ఇప్పుడు ఆ గ్రామం సందడిగా మారింది. బెల్లం తయారీని స్వయంగా వీక్షించి మరీ కొనుగోలు చేస్తున్నారు.

- సంక్రాంతికి ముందు నెల రోజులే తయారీ
- కొనుగోలుదారులతో క్రషర్లలో సందడి
- ఒకప్పుడు 30పైగా ఉన్నా నేడు మూడుకే క్రషర్లు పరిమితం



భారీ కళాయిలో ఉడుకుతున్న చెరకు రసం

తెనాలి: దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామం స్వచ్ఛమైన బెల్లం తయారీకి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే పెట్టింది పేరు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ, రేపల్లె బ్యాంక్ కెనాల్‌కు సమీపంలో ఉండే గ్రామంలోని పంట పొలాల్లోని మూడు క్రషర్లు సంక్రాంతికి ముందు నెల రోజులు బెల్లం తయారీలో నిమగ్నమై ఉంటాయి. ఒక్కో క్రషరులో ఒక పక్క మిషనులో చెరకు క్రషింగ్ చేస్తుంటే, పైపుల్లోంచి ఆ రసం, కళాయిల్లోకి వెళుతుంది. రెండేసి చొప్పున గల భారీ కళాయిల్లోని చెరకురసం, దిగువన భగభగమండే మంటలకు సలసలలాడుతూ పొగలు కక్కుతుంటుంది. పాకం తయారయ్యే వరకు, వంట మేస్త్రీ పెద్ద గరిటెతో తిప్పుతుంటారు. మధ్యలో బెండ పొడరు, సోడా, ఆముదం/కొబ్బరినూనె చల్లుతుంటారు. కళాయిలో మూడున్నర గంటలు ఉడికి బంగారు వర్ణంలోకి వచ్చాక కళాయిని పక్కన పెడతారు. చల్లబడ్డాక పెద్ద అచ్చులుగా పోస్తారు. లేదంటే పావుకిలో చొప్పున బిళ్లలుగా వచ్చే అరలు కలిగిన మౌల్డులో పోస్తారు. మరోసారి వాటిని ఆరబెట్టి, బిళ్లల రూపంలోని బెల్లాన్ని ప్యాకింగ్ చేస్తారు. పెద్ద అచ్చులు పోసిన బెల్లానిఏన మరుసటిరోజు అంటే 15 గంటల తర్వాత కావాల్సిన సైజులో కోసి ఆర్డరిచ్చిన వారికి అందిస్తారు. శృంగారపురంలోని క్రషర్లలో నిర్విరామంగా జరుగుతున్న దినచర్య ఇది.

తోటల్లో చెరకు పెంపకం

వీటి నిర్వాహకులు తమకు కావాల్సిన విస్తీర్ణంలో చెరకును ముందుగానే నాటుతారు. 11 నెలలకు చెరకు తయారవగానే కూలీలతో నరికిస్తారు. క్రషర్లకు తరలించి బెల్లం తయారీకి శ్రీకారం చుడతారు. సంక్రాంతి పండక్కి పిండి వంటల తయారీలో బెల్లానికి డిమాండ్ ఎక్కువని తెలిసిందే. రంగు కోసం ఎలాంటి రసాయనాలు ఇక్కడ కలపరు. బెల్లం జిగురు కోసం బెండ పొడరు, మలినాలు తొలగేందుకు సోడా పొడరు, మాడు వాసన పోయేందుకు ఆముదం తగిన మోతాదులో వినియోగిస్తారు. కోరిన వారికి కళాయి దించాక అచ్చులు పోసే ముందు యాలకులు కలుపుతారు. అచ్చుబెల్లం కిలో రూ.120, బిళ్లల బెల్లం రూ.130, యాలకుల బెల్లం రూ.140 చొప్పున విక్రయిస్తున్నారు. బెల్లం పాకం లీటరు సీసా రూ.150గా ఉంది. ఇక్కడ 35 మంది వర్కర్లతో రోజంతా శ్రమిస్తే 25 బుట్టలు బెల్లం తయారు చేస్తున్నారు. ఒక్కో బుట్ట 33.600 కిలోలు ఉంటుంది.



చల్లారబెట్టి పావు కిలో బిళ్లల అచ్చుల్లో పోస్తున్న దృశ్యం



బెల్లం ప్యాకింగ్

ఇక్కడి నేలలు ప్రత్యేకం

శృంగారపురంలో అన్ని భూముల్లోనూ బెల్లం చెరకు ఊరదు. కొన్ని చేలల్లోనే నాణ్యమైన చెరకు వస్తోందని స్థానికులు చెబుతారు. ఆ ప్రకారమే అక్కడ ఎంపిక చేసుకున్న పొలాల్లో చెరకు సాగు చేస్తుంటారు క్రషర్ల నిర్వాహకులు. గ్రామానికి చెందిన పెందుర్తి రవికాంత్ ప్రస్తుతం ఊరికి ఒకవైపున గల 3.20 ఎకరాల్లోని చెరకును ఇప్పుడు నరికిస్తున్నారు. వచ్చే ఏడాది కోసం ఇటువైపున గల 3.70 ఎకరాల్లో చెరకు నాటుతామని చెప్పారు. 1947 నుంచి ఇక్కడ బెల్లం తయారీ సాగుతోంది. అప్పట్లో పెందుర్తి సుబ్బారావు మొదలుపెట్టారు. 36 ఏళ్లు వ్యాపారం నడిపారు. తర్వాత ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు 16 ఏళ్లు... ప్రస్తుతం మూడోతరంలోని రవికాంత్ పాతికేళ్లుగా దీన్ని కొనసాగిస్తున్నారు. ఒకప్పుడు శృంగారపురంలో 30కి పైగా బెల్లం క్రషర్లు నడిచాయి. ప్రస్తుతం మూడు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ సహకారం లేకుంటే అవి కూడా ఎంతో కాలం మనలేవని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

నేల స్వభావంతోనే ఇక్కడ పరిశ్రమ



గ్రామంలోని కొన్ని నేలల స్వభావం కారణంగానే బెల్లం తయారీ పరిశ్రమ స్థిరపడింది. గతంలో 30కిపైగా క్రషర్లుండేవి. కొందరు రెండేసి క్రషర్లు కూడా నడిపేవారు. శ్రమ, ఖర్చుతో లెక్కేసుకుంటే ఆదాయం పెద్దగా లేకపోవటంతో క్రమంగా అన్నీ మూతపడ్డాయి. కొనుగోలుదారులే మమ్మల్ని ఆదరిస్తున్నారు. ప్రభుత్వ సహకారం ఉంటే బాగుంటుంది.

– పెందుర్తి రవికాంత్, క్రషర్ నిర్వాహకుడు

సొంతంగా బెల్లం తయారీ



అన్నింటిలోనూ కల్తీలు పెరుగుతున్న ఈ రోజుల్లో స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను నేనే తయారు చేసుకుంటున్నా. ఆ క్రమంలో కొంత విస్తీర్ణంలో చెరకు సాగు చేయించి శృంగారపురంలోని క్రషరులో బెల్లం తయారు చేయిస్తున్నా. స్నేహితులు, బంధువులను ఆహ్వానిస్తున్నా. స్వచ్ఛమైన ఆహారం కోసం చేస్తున్న ప్రయత్నమిది.

– కేవీ శివరామప్రసాద్, నూతక్కి

క్లుప్తంగా

నిరీక్షణతోనే దేవుడి రక్షణ



ఫిరంగిపురం: నిరీక్షణ ద్వారానే భగవంతుడి రక్షణ లభిస్తుందని గుంటూరు మేత్రాసన విచారణ గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం దివ్యపూజలో భాగంగా శ్రీసభ నిర్వహించారు. భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ వచ్చే సంవత్సరాన్ని మహా జూబ్లీ ప్రారంభ వేడుకలు నిర్వహించాలని పోప్ ప్రకటించారని చెప్పారు. భక్తి, విశ్వాసం ఉంటే ప్రతి ఒక్కరూ ఏసు మార్గంలో నడవాలన్నారు. అనంతరం శిలువకు ధూపం వేశారు. శిలువతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. విచారణ గురువులు మాల పాటి ఫాతిమా మర్రెడ్డి. సహాయ విచారణ గురువులు రవీంద్ర, ప్రవీణ్, ఫాదర్‌లు విలియమ్, సాగర్‌లు తదితరులు పాల్గొన్నారు.

హంస నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) గుంటూరు జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ 2025 ను ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆదివారం గుంటూరులో ఆవిష్కరించారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం హంస యూనియన్ చేస్తున్న సేవల గురించి అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఆరవ పాల్ ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, స్టేట్ ట్రెజరర్ శ్రీనివాస్, గుంటూరుజిల్లా ప్రెసిడెంట్ బి. నాగవర్దన్, కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ రామకృష్ణ, మచిలీపట్నం ప్రెసిడెంట్, జిల్లా జాయింట్ సెక్రటరీ మహమ్మద్ షరీఫ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరువెస్ట్ (క్రీడలు): ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్–2025ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఆయన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ క్యాలెండర్‌కు డాక్టర్ విజయచంద్ర ఆర్థిక చేయూతనందించారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కరీముల్లా షాఖాదరి, సుమిత్రా దేవి, మురళి, రామిరెడ్డి పాల్గొన్నారు.

అండర్–12 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జనవరి 9వ తేదీ నుంచి కృష్ణా జిల్లా మూలపాడులో జరగనున్న అండర్–12 సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ 3 మెన్ కమిటీ సభ్యుడు యు.మహతి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పోటీలు నిర్వహించిన ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. సదరు జట్టు మేనేజర్‌గా వి.అనిల్ కుమార్ వ్యవహరిస్తారన్నారు.

సమాజాన్ని మేల్కొలిపేలా నాటికలు

పెదకాకాని: మానవత్వం అంతర్లీనంగా ఉన్నప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని రచయిత, బంగారు నంది గ్రహీత పిన్నమనేని మృత్యుంజయరావు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో గత మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. సమాజాన్ని మేల్కొలిపేలా ఇవి సాగాయి. గ్రామానికి చెందిన డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో లలిత కళానికేతన్ వారి నిర్వహణలో 14వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో కళాకారులు నిత్యం సమాజంలో జరుగుతున్న పరిణామాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. చివరిరోజైన ఆదివారం సాయంత్రం రసఝరి పొన్నూరు వారి గురి తప్పిన వేట నాటిక ప్రదర్శించారు. దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు ప్రేక్షకులను ఆలోచింపజేశారు. అనిత పబ్లిక్ స్కూల్ వారి సత్యపాలన నాటికలోని పాత్రలకు దర్శకుడు జరుగుల విద్యార్థులను తీర్చిదిద్ది, జీవం పోశారు. శ్రీచైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారి అ–సత్యం నాటిక ప్రదర్శించారు. మనిషి హృదయంలోనే అన్నీ ఉంటాయని దర్శకుడు బాలాజీ నాయక్ తెలిపారు. తక్కెళ్ళపాడు సాయి చైతన్య స్కూల్ వారి పెళ్ళిసందడి హాస్య నాటికతో చిన్నారులు కడుపుబ్బ నవ్వించారు. జరుగుల దర్శకత్వంలో ఇది ప్రదర్శితమైంది. చివరిగా లలిత కళానికేతన్ తక్కెళ్ళపాడు వారి ప్రత్యేక ప్రదర్శన బొచ్చుబాబా నాటిక అప్పసాని నాగమల్లేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. కళాపరిషత్‌లను, కళాకారులను ప్రోత్సహించాలనే వినూత్న ఆలోచన అభినందనీయమని ప్రముఖ కళాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు నల్లమల అమర్నాథ్ అన్నారు. రోజూ బాలలతో రెండు పరిషత్ నాటిక ప్రదర్శనలు ఉండేలా రూపొందించిన ప్రణాళిక అభినందనీయం అన్నారు.



అనిత పబ్లిక్ స్కూల్ వారి సత్యపాలన నాటికలోని సన్నివేశం



రసఝరి పొన్నూరు వారి గురి తప్పిన వేట నాటికలోని సన్నివేశం

బహిరంగ ప్రదేశాల్లో వేడుకలకు అనుమతుల్లేవు

- ప్రజలకు ఇబ్బందుల్లేకుండా నూతన సంవత్సర ఉత్సవాలు నిర్వహించుకోవాలి
- ఈ సంవత్సరం పెరిగిన రహదారి ప్రమాదాలు
- మార్చి కల్లా 5 వేల సీసీ కెమెరాలు
- వార్షిక నేర సమీక్షలో జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ఆల్కాహాల్, కేక్‌లు కట్ చేసేందుకు అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇండోర్‌లో నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని చెప్పారు. నిర్ణీత వేళల్లో దుకాణదారులు మూసివేయాలని అన్నారు. ఈవెంట్స్ కోసం అనుమతి తీసుకున్న నిర్వాహకులు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతిస్తామని, తర్వాత మూసివేయాలని అన్నారు. ఆల్కాహాల్ విషయమై ఎక్సైజ్‌శాఖ అనుమతి ఉందా లేదా చూసుకోవాలని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ర్యాష్ డ్రైవింగ్ చేపట్టిన చర్యలు ఉంటాయని, డ్రంకన్ డ్రైవ్ చేపడతామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చేసుకోవాలని సూచించారు. 2023–24 నేరాల సంఖ్య తగ్గాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఐదు శాతం పెరిగాయని అన్నారు. జిల్లాలో వివిధ నేరాలతో ప్రమేయం ఉన్న 12 మందిపై పీడీ యాక్ట్‌లు నమోదుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడిలో ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఇప్పటికే 620 సీసీ కెమెరాలు ఉన్నాయని, వచ్చే ఏడాది మార్చి కల్లా ఐదు వేల సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐదారు నెలల కిందట చేబ్రోలులో జరిగిన మైనర్ బాలిక హత్య కేసుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, నిందితుడ్ని అరెస్ట్ చేశామన్నా రు. సైనెడ్ కలిపి మహిళలను హత్య చేసిన ముఠాను చాకచాక్యంగా పట్టుకున్నామని ఎస్పీ గుర్తుచేశారు. జిల్లా ఏఎస్పీలు ఏటీవీ.రవికుమార్ (ఎల్‌ఓ), సుప్రజ (క్రైం), డీఎస్పీలు పాల్గొన్నారు.

ఘనంగా శారద శత జయంతి వేడుకలు



తెనాలి: ప్రఖ్యాత తెలుగు రచయిత, తెనాలికి చెందిన శారద (ఎస్.నటరాజన్) శత జయంతి వేడుకలు ఆయన జన్మస్థలమైన తమిళనాడు రాష్ట్రంలోని పుదుక్కోట్టైలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. శారద జీవితంపై తెనాలికి చెందిన విహారి రచించిన పుస్తక తమిళ అనువాదాన్ని ఆ వేదికపై ఆవిష్కరించారు. గుంటూరుకు చెందిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అఖిల భారత అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం తమిళనాడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగ, డాక్టర్ ఆరం, అరసం జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, టీఎస్ నటరాజన్, తమిళ అనువాదకురాలు రాజ్యలక్ష్మి కోదండం పాల్గొన్నారు. శారద రచనలను ఆంధ్రప్రదేశ్ అరసం పునర్ముద్రించిన విషయం తెలిసిందే.

సీఆర్‌డీఏ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో కొండవీటి వాగు ఆధునికీకరణ కోసం సీఆర్‌డీఏ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మార్కింగ్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాధిత రైతులు ఆదివారం ఉండవల్లిలో దీనిపై సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్న శివశంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు మార్కింగ్ చేయడం దారుణమని తెలిపారు. నష్టపరిహారం విషయాన్ని అధికారులు స్పష్టం చేయలేదని, గ్రామ సభలను నిర్వహించి అభిప్రాయాలు సేకరించలేదన్నారు. బలవంతంగా రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని, జనవరి 2వ తేదీన సీఆర్‌డీఏ అధికారులను కలిసి వినతి పత్రం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, రైతులు మున్నంగి శ్రీధర్ రెడ్డి, కనకయ్య, బక్కిరెడ్డి, రంగారెడ్డి, శంకర్,శివరామిరెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాడికొండ: తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో 1999వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పిల్లాపాపలతో పాఠశాలకు చేరుకున్న నాటి విద్యార్థులు తమ తోటి వారిని ఆప్యాయంగా పలకరించారు. నాటి స్మృతులు నెమరువేసుకున్నారు. తరగతి గదులలో కలియదిరిగి నాడు చదివిన తీరు, ఇతర విశేషాలను కుటుంబసభ్యులకు చూపించి సంతోష పడ్డారు. నాటి క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని సభాపూర్వకంగా వివరించారు. వారు నేర్పిన విద్యా బుద్ధులే నేడు తమను ఉన్నత శిఖరాలకు చేర్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితాలకు పునాదులు వేసిన పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం నాటి గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ అదనపు కమిషనర్ కె.రాకేష్, ఏపీఆర్‌ఈఐఎస్ ఎస్ఈ రమణ, కేఆర్ దేశాయ్, రవికుమార్, ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ ఎం.జోగారావు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల కోసం గిరిజనులు ఐకమత్యంగా పోరాడాలి

- రిటైర్డ్ ఐఏఎస్ మాటా రామారావు
- గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ వేడుకలు



సమావేశానికి హాజరైన సంఘం ముఖ్యనేతలు

గుంటూరు మెడికల్: గిరిజనులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని, న్యాయమైన తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మాటా రామారావు సూచించారు. ఆదివారం గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ మీటింగ్ హాలులో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్, గుంటూరు జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాట రామారావు, డెప్యూటీ కలెక్టర్ కె.రాములు నాయక్ హాజరయ్యారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేడా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి బాణావత్ చిన్న స్వామినాయక్ మాట్లాడుతూ గిరిజనులు విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, విద్యా ద్వారా మనకు సమస్తం లభిస్తాయని చెప్పారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు తమకు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ ప్రకారం ఉద్యోగ నియమకాలు, ప్రమోషన్స్ విషయంలో తగినంత అవగాహనను కలిగి ఉండాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు పి.వి.రమణ మాట్లాడుతూ 1964 సంవత్సరంలో కుంభ రంగారావు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ సంఘం అంచలంచలుగా ఎదుగుతూ నేడు డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. సంఘం అభివృద్ధికి పాటుపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి హరిరామ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విభాగాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఎక్కువమంది సభ్యులను సభ్యత్వం ఇచ్చి సంఘాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ భుక్యా లక్ష్మానాయక్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు విషయం గురించి, తీసుకోవలసిన బాధ్యతల గురించి వివరించారు. గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షులు మేడా శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ మొగిలి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నాయకులు బాలు నాయక్ భూక్య, దినారి ప్రభాకర్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు ఇండ్ల సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయ్యాల శ్యాం వరప్రసాద్, రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్స్ డాక్టర్ బాలాజీనాయక్ బానోత్, రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షుడు పేరం పవన్‌కుమార్, గుంటూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి మూడవత్ కోటేశ్వరరావు నాయక్, కోశాధికారి పాలపర్తి శ్రీనివాస్‌రావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, కాంద్ర కొండ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పికిల్‌బాల్ పోటీలకు ఏడుగురు ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు) ఒడిశాలోని భువనేశ్వర్‌లో జనవరి 3 నుంచి 5 వరకు జరగనున్న జాతీయ స్థాయి పికిల్ బాల్ పోటీలకు వివివి హెల్త్ క్లబ్ నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని క్లబ్ డైరెక్టర్ కె.అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ క్లబ్‌లో సాధన చేస్తున్న పి.ఆనంద్‌కుమార్, కె.అరుణ్‌కుమార్, ఎం.భరత్‌కుమార్, నాగరాజు, పి.సూర్య ఆకాష్, చరణ్, మన్సూర్ వలిలు రాష్ట్ర పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యారన్నారు. క్లబ్‌లో ఎంపికైన క్రీడాకారులను ఏపీ పికిల్ బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీధర్, కోచ్ జీవీఎస్ ప్రసాద్, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబులు అభినందించామని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

రెగ్యులరైజేషన్ సాధన సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రతినిధులు



నినాదాలు చేస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా జేఏసీ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ సాధన సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమావేశమైన కాంట్రాక్టు అధ్యాపకులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గంతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు వై.రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3,618 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా అధ్యాపకుల రెగ్యులరైజ్ డిమాండ్‌తో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లాల వారీగా జేఏసీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జేఏసీ కో–చైర్మన్‌గా పి.శ్రీరాములు (మాచర్ల), వైస్ చైర్మన్‌గా ఎన్వీ రమణ(గురజాల), కోశాధికారిగా కె.సుధీర్ (దుర్గి), కార్యదర్శిగా కె.జయశ్రీ (కావూరు), కార్యనిర్వాహక కార్యదర్శులుగా వి.బాలునాయక్ (బెల్లంకొండ), కె.ఉమా మహేష్ (వినుకొండ), కె.రమేష్‌బాబు (గురజాల), జె.బద్యానాయక్ (గురజాల), కో–ఆర్డినేటర్లుగా ఎం.అభయ ప్రదాంబ (గుంటూరు), ఎండీ ప్రవీణ్ సుల్తానా (గుంటూరు), జి.హర్షిత (దుర్గి), మహిళా కార్యదర్శిగా కావూరుకు చెందిన ఎం.నాగలక్ష్మితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా టి. శ్రీనివాస్ (గురజాల), ఎం.బాలయ్య (కావూరు), ఏ.భార్గవి (గుంటూరు), వి.శివన్నారాయణ (అచ్చంపేట) ఎన్నికయ్యారు.

పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి



కేఎస్ లక్ష్మణరావుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న కృష్ణా–గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. ఆదివారం మెడికల్ కళాశాల వద్ద ఉన్న ఎన్జీవో కల్యాణ మండపంలో కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసనమండలిని పునరుద్ధరించిన తరువాత 17 ఏళ్లలో 14 మంది ప్రోగ్రెసివ్ డెమోక్రిటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పక్షాన ఎమ్మెల్సీలుగా గెలుపొంది నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతోపాటు నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, కార్మికులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాల సమస్యలపై శాసనమండలి వేదికగా పనిచేశానని చెప్పారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి నిజాయితీగా పనిచేశామని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ ప్రయోజనాల కోసం పీడీఎఫ్ పనిచేస్తోందని తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఎన్.నాగయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం లక్ష్మణరావు పనిచేస్తారని చెప్పారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు వీవీకే సురేష్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను లక్ష్మణరావు బలపరిచారని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ నాయకురాలు రత్న, మోడల్ స్కూల్స్ యూనియన్ నాయకులు హేమలత, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, యూనివర్సిటీ యూనియన్ నాయకులు భానుప్రసాద్, ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు గాంధీ మోహన్ రావు, పోస్టల్ యూనియన్ నాయకులు రామకృష్ణ, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆవాజ్ నాయకులు చిష్టీ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకురాలు ధనలక్ష్మి, పాలిటెక్నిక్ అధ్యాపక సంఘ నాయకురాలు స్వాతి తదితరులు ప్రసంగించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం?

నంబూరు మహిళ హత్య కేసులో వెలుగులోకి పలు విషయాలు



చిన్నారితో షేక్ మల్లిక, ప్రేమ్‌కుమార్ (ఫైల్)

పెదకాకాని: వివాహేతర సంబంధం కారణంగానే నంబూరులో మహిళ హత్యకు గురైనట్లు తెలిసింది. స్థానికుల ద్వారా సేకరించిన విశ్వసనీయ సమాచారం మేరకు... పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో చనిపోయిన షేక్ మల్లికది హత్యేనని నిర్ధారణ అయింది. నంబూరుకు చెందిన షేక్ మల్లికను పది ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన షేక్ అక్బర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి పాప, బాబు సంతానం. మల్లిక ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో పిల్లలు పుట్టిన కొద్ది రోజులకే గొడవలు జరిగాయి. దీంతో ఆమె భర్త నుంచి విడిపోయింది. తరువాత గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌ను వివాహం చేసుకుంది. వీరు కొంతకాలంపాటు గుంటూరులో కాపురం పెట్టారు. ఆ సమయంలో బంగారం వ్యాపారం చేసే రెహమాన్‌తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. మల్లికకు సంతానం కలగకుండా ఆపరేషన్ అయింది. దీంతో సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి మల్లిక దంపతులు పెంచుకునేందుకు పాపను కూడా రెహమాన్ తీసుకొచ్చి ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల దంపతులు నంబూరుకు కాపురం మార్చారు. అప్పటి నుంచి రెహమాన్‌కు ఆమె దూరంగా ఉంటోంది. స్థానిక యువకుడితో వివాహేతర సంబంధం కారణమని రెహమాన్ గుర్తించాడు. దీంతో శనివారం ఆమెను హత్య చేసేందుకు ఇద్దర్ని నంబూరు పంపాడు. మల్లిక విషయాలను మరొక మహిళ ఫోన్ ద్వారా రెహమాన్‌కు చేరవేస్తూ వచ్చింది. ప్లాన్ ప్రకారం ముఖానికి మాస్కులు ధరించిన ఆ ఇద్దరు వ్యక్తులు ఆమెను హతమార్చి తిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీనిపై పెదకాకాని సీఐ టి.పి. నారాయణ స్వామి మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఉందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

దేశాభివృద్ధికి యువత కృషి కీలకం



స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు

తెనాలి: యువతరం తమ మేధస్సును దేశ ప్రగతికి వినియోగించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు సూచించారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు 20వ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రదానం కార్యక్రమం జరిగింది. 341 మంది విద్యార్థులకు రూ.16 లక్షలను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లిముంత వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. రామచంద్రప్రభు మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. తులసి రామచంద్రప్రభును అభినవ శ్రీకృష్ణదేవరాయ బిరుదుతో సత్కరించారు. రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు, ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్ర, హైదరాబాద్‌లోని హిమాన్వీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరవ రామకృష్ణ, సంఘ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జె.కోటినాగయ్య, విశ్రాంత ఐఆర్‌ఎస్ బళ్లా నరేంద్రకుమార్, డాక్టర్ బి.సాంబశివరావు, డాక్టర్ ఇమ్మడిశెట్టి మారుతీప్రసాద్, డాక్టర్ గాలి దీప్తి, సీఆర్‌డీఏ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. తొలుత వి.నిత్యసంతోషి కూచిపూడి నృత్యం ప్రదర్శించగా, విజయనగరం జిల్లాకు చెందిన జి.వినోద్ కుమార్ గజల్స్ ఆలపించి అలరించారు.

టాలీవుడ్ దర్శకుడిపై దాడి



దర్శకునిపై దాడి చేస్తున్న దృశ్యం..

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): టాలీవుడ్ దర్శకుడు తిరుమలశెట్టి కిరణ్‌పై మెరుపు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు అరండల్‌పేటలోని శివ థియేటర్‌లో డ్రింకర్ సాయి చిత్రం ప్రదర్శితమవుతుంది. ప్రమోషన్‌లో భాగంగా మధ్యాహ్నం ఆటకు చిత్ర దర్శకుడు తిరుమలశెట్టి కిరణ్, నటుడు ధర్మ, చిత్ర బృందం విచ్చేశారు. థియేటర్‌లోనికెళ్ళి బయటకు వచ్చిన చిత్ర బృందంతోపాటు దర్శకుడు కిరణ్ మీడియాతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో దర్శకుని వద్దకు కొందరు చొచ్చుకు వచ్చారు. అనంతరం దర్శకుని చొక్కా కాలర్ పట్టుకుని చేయి చేసుకున్నారు. హఠాత్తుగా జరిగిన పరిణామానికి ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యపోయారు. ఈలోగా ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. మంతెన సత్యనారాయణను కించపరిచేలా పాత్రను సృష్టించడం తగదని గట్టిగా కేకలు వేశారు. లక్షలాది మంది సినిమా వీక్షిస్తుంటారని అన్నారు. ఈలోగా చిత్ర బృందంలో కొందరు జోక్యం చేసుకుని సినిమాను సినిమాలా చూడాలని విన్నవించారు. చివరికి చిత్ర బృందం అక్కడ నుంచి నెమ్మదిగా జారుకున్నారు. దర్శకునిపై జరిగిన దాడిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.